# కృషితో జాస్తి దుర్భిక్షం...

''నేను అప్పుడే చెప్పలా? ఈ మొగోడు మార్కెట్టుకు పోతే కుక్క సంతకు పొయి నట్టే అవితిందని!... కుక్క సంతకు పోతే ఏమయితిందో మీ మొకం మీకేం తెల్సు? అసలు సంతంటే అదెట్టుంటిందో తెలిస్తేగదా కుక్క సంతకు పోతే ఏమయితిందో తెల్సేదానికి!''

ఆపొద్దు నేను నిద్దర కండ్లల్లోనే పెట్టుకోని మార్కెట్టు కాడికి పొయ్ అరకిలో వంకాయలు తెచ్చినా. అవ్వెత్తి ముందర పోసుకోని మా బాశాలి మునం పట్టింది. ఒక పని చేస్తే దానికి ఏందో ఒక వొప్పారం చెప్పకుండాపోతే ఆపెకు నిద్దర పట్టదు. 'ఇది ఎప్పుడూ ఉండే గోకుడేగదా? వాగితే వాగనీలే' అని యినీయిన్నట్టుగా ఉండిపోతే సరిపోతిందని సరి పెట్టుకుందామంటే చీమూనెత్తురుండే మణిసి జల్మంగదా? – వొళ్లు రగిలె.

''ఈ కొంపలో యింతకూ అంతకూ ఒక సంత జరగతావుంటే యింక సంతంటే కొత్తగా తెలుసుకోవాల్నా?'' అంటే–

''ఆ సంతల్లోగూడా యిట్టా మాదిర వొకరి మింద వొకరు యిసుర్లు యిసురు కుంటారా నాయనా?''

కడగోటు బిడ్డ. ఆ బిడ్డకు యిల్లు యిస్కూలు తప్పిస్తే రొండోది తెల్దు. ఆ బిడ్డ నిలదీసె!

''అమ్మా! మాయమ్మ వొక్కవారం యిడ్సిపెట్టకుండా బుదోరం పెనుమూరు సంతకు ఎర్రగెడ్డలు, బేస్తారం పాతగుంట సంతకు తమలపాకులు ఉచ్చి మింద బొచ్చు రాలిపొయ్యే టట్టుగా మోసింది. మీ అమ్మ ఏ సంతకు పొయ్యిందో? నాకైతే తెల్దు. ఆడ ఏకుక్కను చూసిందో? ఏకుక్క ఏం చేసిందో?...''

''సంతల్లో సరుకు అమ్ముకుండే దానికో కొనుక్కుండే దానికో మణుసులు పోతారు. కుక్కలెందుకు పోతాయి నాయినా?''

''ఆ మాట నన్నడిగితే ఎట్టమ్మా? మీ అమ్మనే అడుగు.''

''అవునవును. నన్నడుగు చెప్తాను. తూనిక్కట్టె దెబ్బలు తినేదానికి''

''నీకే నోరుండాదని యింత అన్నాయంగా మాట్లాడ్తే ఎట్టమ్మా? అప్పిటికి నువ్వు

అంటావుండే మాటేంది? మార్కెట్టుకు పాయ్ మాఅయ్యె కుక్కమాదిర్తో తూనిక్కట్టె దెబ్బలు తినేసివచ్చినాడనా? ఆయనకేం గాచ్చారంపట్లా?''

ఎమ్మే చదువుకుణ్ణె బిడ్డ నన్ను ఎనకేసుకోని వచ్చె.

''అయ్యయ్యో! ఆయినకేం గాచ్చారం పట్లా. అంతకు ముందు మీకూ పట్లా. పట్టిందంతా నాకే తల్లీ. పెద్ద మొగలాయి మాదిర వకాల్తా తీసుకోని వాదిస్తావుండావే? వచ్చి చూడు. అరకిలోకు ఆరు వంకాయిలు తూగితే దాంట్లో వొగిటి పుచ్చిపొయ్యింది. ఒగిటి పొండుబారింది. మూడోది ముదిరిపొయ్యింది. ఇంక మిగిలింది మూడుకాయిలు. ఆ మూడుకాయిలు కూరొండి మద్దేణం కాడ ఎవురి ముక్కులో పెట్టాల. పోనీ! పది పైసలు సలీసుగా తెచ్చినాడంటేనా? అదీ లేక పాయ. ఈదల్లో 'అర కిలో అర్ధరూపాయి! అరకిలో అర్ధరూపాయి!' అని తరిమి తరిమి అమ్మతావుంటే ఈ మొగోడు ఈ పుచ్చిన కాయిలకు ముక్కాలురూపాయి పెట్టొచ్చినాడు.''

''నా దగ్గిర మార్కెట్టు కతలే ఎత్తబాకండి!'' అని ఎన్ని మాట్లు నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుణ్ణా. మీ చెవల్లో పడిందా? పోనీలే అని చెప్పింది చేస్తే యిద్దో యిట్టా అరవైయారు సొట్టలు చెప్తాకూసుంటారు. ఎట్ట చావమంటారు నన్నీ చావు?''

''నువ్వు చావనూ వద్దే. బతికించనూ వద్దే. ముందు నువ్వీ వంకాయిలు ఎత్తుకోని పాయ్ వాడి మొకాన కొట్టేసి ఆ దుడ్లను తెచ్చి నా ఎదాన ఏడువు. మల్లా నా ఏడుపు నేను ఏడ్సుకుంటా.''

మా బాశాలి తీర్పు చెప్పేసింది. అదేమన్నా కోర్టు చెప్పిన తీర్పు అయితే దానికి పై కోర్టు వుండాది. ఆడకూడ కాకుండాపోతే అంతకు పైనకూడ కోర్టు వుండాది. ఇది అట్టా గాకపాయనే. తీర్పు- అంటే తీర్పే! మిన్నిరిగి మింద పడ్తావుణ్ణా మినకరిస్తా నిలబడుకుంటే యింకేమీ లే. వేమన్న గుర్తుకొస్తాడు. ఆ మొనగాడు చెప్పిన పద్దెం గుర్తుకొస్తింది. ఎర్రి బాగలోడైనా ఎంత బాగా చెప్పినాడు. చెప్పులోరాయి... చెవులో జోరీగ... కాలిలో ముల్లు... కంట్లో నలుసు... ఇంట్లో పోరు యింతింత కాదంట!

ఆ మహన్నబావుడికి ఒక దణ్ణం పెట్టి ఆ వంకాయిలెత్తి సంచిలో యేసుకోని చంకకు తగిలించుకుణ్ణా. శివుడా! అని ఎలబర్నా.

చీమకు రాసినరాత శివుడికి రాసిందంటారే? అదెట్టబ్బా అంటే? చీమను దోమను పుట్టించినోడే శివుడైతే చీమకు రాసినరాత శివుడికి రాసేదంటే మాట్లా? అంటా జుట్టు పెరుక్కుండే వాణ్ణి. ఇప్పుడు చూడబోతే అది నిజమే అనిపిస్తా వుండాది. లేకుండాపోతే నాకు పట్టిన గెతినేమనాల?

''బేరమాడేదానికి నాకు శాతరాదే?'' అంటే...

''అవునవునులే! దోవన పోతా పోతా వచ్చేపొయ్యే ఆడోళ్లతో సరసాలాడే దానికైతే తెలిస్తింది కానీ బేరమాడేదానికి ఎట్ట తెలిస్తిందిలే?'' అనే మా బాశాల్ని మీరుగూడా

ఎనకేసుకోని రాబాకండి. నేను చెప్పేదంతా శ్రెద్ధగా యినండి. అప్పుడుగూడా అనాలనిపిస్తే మీ యిష్టపకారమే అనండి.

నా చిన్నప్పుడు మా యింట్లో అందురు తొలి యిడత తలా ఒక ముద్ద సంగటి తింటారు. మలిడత అంతకూడు తింటారు. నేను కడగోటోణ్ణి కదా? నేనంటే మాయమ్మకు శానా ముదిగారం. అందుకని తొలిడత మలిడత కూడా నాకు కూడే పెట్టేది. తొలిడత అందురు సంగటి తింటావుంటే మనం కూడు తింటా వుండామనే పెగ్గె పెనుమూరుదాకా పొయ్యేది. వగలుపడ్తా కంచంలో కోడి కెలుకుళ్లు కెలకతా తింటావుంటే కంచం చుట్టూ కూటి మెతుకులు రాలి పడుంటాయి. అవ్విగానా మా అయ్య కంట్లో పడ్తే చాలు. నేరుగా నేను తింటా వుండే చోటికి వచ్చేవాడు. నన్ను మింగేసే వాడి మాదిర చూస్తానే వంగి నేల మింద రాలి పడుండే మెతుకులు రొండు చేతికెత్తుకుంటాడు. వాటిని నాకు చూపిస్తా 'ఒరే అబ్బోడా! ఈ మెతుకులు ఈడికి ఎట్టొచ్చినాయో చెప్పరా!' అని గదమాయించి అడిగేవాడు.

అప్పావుపిళ్ల అయ్యోరు పరీచ్చల్లో అడిగే కొచ్చిన్ మాదిర అడగతావుండాడే అని నవ్వుకుంటా నేను తింటావుండేది నిలిపేస్తా. లేచి నిలబడి మడిచేతులు కట్టుకుంటా.

''ఎగదాల అరలో వరసగా దొంతులు ఉండును. ఆ దొంతుల్లో కడవలుండును. ఆ కడవల్లో రాగులు జొన్నలు ఉన్నట్లే బియ్యం కూడా ఉండును. ఆ బియ్యమును అమ్మ వండును. మనము తిందుము. అట్లా తింటూవుండగా పున్నెం చేసుకొన్న మెతుకులు నోట్లోకి పోవును. పాపం చేసుకొన్న మెతుకులు నేల పాలగును!'' అని గుక్క తిరక్కుండా చెప్పేకుందికి మా అయ్య కోపం ఎట్టాపోతిందో గాలికి పోతింది.

''నాకొడుకు ఉడుబోతుకాయి గదా? దొంతిలో బియ్యం ఎసుట్లోకి వచ్చేదాకా చెప్పినావు. అయితే ఆ దొంతిలోకి బియ్యం ఎట్టొచ్చిందో చెప్తే గదారా?''

''ఏముండాదయ్యా? వడ్ల గింజిల్లో బియ్యపు గింజిలే గదా?''

''ఆ వడ్లు ఎట్టొచ్చినాయి.''

''వరి పైరు కోస్తే వడ్లొచ్చినాయి.''

''వరి ఎట్టొచ్చింది?''

''పైరు పెట్తే వచ్చింది?''

'' ఆ పైరు ఎట్ట పెట్నాం?''

''నీళ్లు గట్టి పైరు పెట్నాము.''

''ఆ నీళ్లు ఎట్టొచ్చినాయి?''

''మోటతోల్తే నీళ్లొచ్చినాయి''

''అంటే వొరే కొడకా! అడుసు దున్నినామా? నారు పోసినామా? ఆ నారును పసిబిడ్డ మాదిర్తో పెంచినామా? ఆ నారుపెరికి మల్లా నాట్నామా? ఆర్నెల్లు పొడగనా వొక్కదినం యిడ్సి పెట్టకుండా ఈ లోతు బావుల్లో మోటగట్టి పైరుకు తడేసినామా? తాలు కొట్నామా? కళ్లంలో ఆ వడ్లు గంపలకెత్తి యింటికి మోసుకోని వచ్చినామా? ఆ

వడ్లు దంచినామా? దంచిన వడ్ల బియ్యం అయితే అప్పుడు దొంతిలో కడవకు పోసినాం. అప్పుడగదా మీయమ్మ ఆ బియ్యాన్ని ఎత్తుకోని కూడు వండింది. ఇంత కష్ట పడ్తే గదరా ఈ మెతుకులు కంచంలో పణ్ణాయి. అట్టా పుట్టరాని మెతుకులు నేల రాల్తే నీయమ్మా కుండాకోర్ నా కొడకా! కడుపట్టా రగలదంట్రా?'' అని మెత్తమెత్తంగానే రొండు వడ్డించేవాడు.

లేత మణుసులో ఆ మాట బాగా నాటుకోని పొయ్యుండాది. అద్దో ఆ పొద్దుటి నుంచే యింటి ముందిరి కొచ్చిన కట్లె మోపైనా కాయాగసురైనా బేరమాడే పనేలే. ''అవ్వి ఎంత కష్టపడ్తే యీడికొచ్చినాయి?'' అని ఒక్క సెణం ఆలోచిస్తే మల్లా బేరమాడేదానికి మణుసు ఎట్టావొప్పితింది?

ఇండ్లల్లో కూసోని కాళ్లాడించుకుంటా అయినకాడికి నిమ్మతిగా తింటా వరి పైరంటే? అదెంత పెద్ద చెట్టో? ఎంత పెద్ద మాకో? అనుకుండే వాళ్లకు ఎంత చెప్తే మాత్రం ఏమి అర్తం కాబోతింది. నాబాద వాళ్లకేం తెలిస్తింది? బేరమాడ లేదని బేవార్సకూతలు కుయ్‌మంటే కూస్తారు.

ఇట్లా నాలో నేను మలగుల్లాలు పడుకుంటా ఆ నాలుగ్కాళ్లమండపం కాడికి పొయ్యే కుందికి వెంకటరెడ్డి ఎదురుపడె. తిరపతిలో అడుగుపెట్టానే అట్టా యిట్టా చూడకుండా నేరుగా యింటి కాడికే వొచ్చేవాడు. యాడేడ తిరిగినాడో ఏమో పాపం! మణిసి బాగా బెట్టబడి పొయ్యుండాడు. వాణ్ణి చూసేకుందికి మణుసు ఒక మాదిరైపాయ!

''ఏమిరా వెంకటరెడ్డీ! ఎప్పుడొచ్చినావురా? అదేందది అట్టుండావే?'' అని అడిగితే-

''ఓ యబ్బా! తెల్లారనంగా వచ్చినా నన్నా! ఈ తిరపతిలో తిరగని ఈదిలేదంటా తిరిగేసి వస్తా ఉండా. ఆ ఎత్తుబారం కత మల్లా చెప్తాకానీ ఆ సంచిలో ఏముండాదన్నా?

''అడిగడిగి సంచిలో ఏముండాదని అడిగెనే! పాపం ఆకిలితో ఉండాడేమో!'' అనుకుండే కుందికి నా మణుసులో మణుసు లేకుండా పాయ. అయినా అడిగిందానికి బొదులు చెప్పాల గదా?-

''శాతగానమ్మకు చెవుకాడ కొప్పు! అన్నెట్టు ఈ పొద్దు నేనొక శాతగాని పని చేసినాన్రా. మార్కెట్టుకు పొయ్ రొండు వంకాయి పిందెలు తెమ్మంటే తెస్తి. అరకిలో తెస్తే దానికి చెప్పేది అర్వైఆరు సొట్లా? అర కిలో అర్ధ రూపాయికి అమ్మతా ఉంటే ముక్కాలు రూపాయి పెట్టొచ్చినానని మూతి మింద పొడుపులా? వద్దురా సామీ వద్దు. ఎత్తుకొనిపొయ్ యిచ్చేసి రమ్మంటే పోతా వుండా. ఆడికిపొయ్ వాపస్ తీసుకోరా అంటే వాడెన్ని సదగబోతాడో ఏంపాడో?''

''అన్నా! నువ్వేమీ అనుకోనంటే నన్నొక మాట చెప్పమంటావా? ఇంత కాలం రేత్రి అనుకోలా. పొగులనుకోలా. వొంచిన నడుము ఎత్తకుండా సేద్దెం చేసినా. ఈ పొద్దు నాకేమని

పిస్తా ఉండాదంటే ఉణ్ణింది బణ్ణంది వొగిటికి సగంగా అమ్మి పారేసి ఈడికొచ్చి గొరిగేది నేర్చుకుంటే శానా మేలనిపిస్తా ఉండాదన్నా!''

కుమ్మేత్తుకోని గూడూరికి పోతావుంటే ఏడు కుమ్ములు ఎదురుంగా వొచ్చినట్లు నాకుమ్మ నాది. వాడి కుమ్మ వాడిది. అదే అర్తంగాకుండా వాడికల్లానే చూస్తా వుంటే-

''అన్నా! ఈ తిరపతిలో చూడబోతే ఈదికొక మంగల షాపు వుండాది. గెడ్డం గీయించుకుందామని ప్రెతి షాపు ఎక్కి దిగినా. ఎవుడు చూడు రొండు రూపాయిలకు దమ్మిడి తక్కవ కాదంటే కాదనె! పోనీ నా మాదిర ఒక నాయాలన్నా బేరమాడ్తా ఉండాడా? లేదే? వాడు అడిగినంత చేతిలో పారేసి పోతా ఉండాడు. మల్లా ఆ యదవలకే ఈ మార్కెట్టు కాడికొచ్చే కుందికి కాసుల యిలవతెల్సి చచ్చేటట్టుగా ఉండాది.''

వాడు కలిగిన మాటే అంటావుంటే కాదనలేకుండా యింటావుండా!

''మూతికంత సబ్బు పూసేసి కత్తిని అట్టయిట్టా రొండుసార్లు తిమిడేసి అట్టొక యీడుపు యిట్టొక యీడుపు రొండీడుపులు ఈడ్సేస్తే రొండు రూపాయిలు నికరంగా చేతిలో పడిపోతా ఉండాది. అదే రైతుండాడు. ఆ రొండు రూపాయిలే సంపాయించాలంటే ఈ పొద్దు రేటు పకారం రొండు కిలోల వంకాయిలు అమ్మాల. అదే పదీ యిర్వై గంపలు జాస్తిగా వచ్చేస్తే కాసుకు గంపడంటారు. ఆ వంకాయిలు మార్కెట్టుకాడికి వచ్చేకుందికి ఎన్నన్నా రైతు పడేపాట్లు? నీళ్ల గట్టాల్నా? పూతా పిందె కొచ్చేటప్పిటికి మొందూ మాకూ కొట్టాల్నా? కాపుకొస్తే ఉడతా మిడతా వాత పడకుండా కంటికి వత్తేసుకోని కాపాడు కోవాల్నా? పలుబాట్లు పడి ఈడికి తెస్తే ఏరేటుకు పోతాయో ఆ దేముడికే ఎరిక!

ఆ వచ్చే దుడ్లు రానూ పోనూ శార్జీలకు లగేజీకన్నా సరిపోతిందో సాల్దో. అది మరీ పాణ సంగటం! ఇప్పుడు చెప్పన్నా ఈ సేద్దిం నాద్దిం చేసేదానికంటే గొరిగేది నేర్చుకుండేది మేలవునో కాదో?''-

''ఒరే అబ్బోడా! ఈ దేశింలో లచ్చలకు లచ్చలు సబ్బులు తయారు చేస్తా ఉండారు. గొరుక్కుండే బ్లేడ్లు తయారు చేస్తా ఉండారు. ఇటుమంటివి ఎన్నో యింకెన్నో తయారుచేస్తా ఉండారు. ఎన్ని చేసినా వీటిరేటు దిన దినానికి ఎగబడే పనే గానీ దిగబడే మాటేలేదు. ఈళ్ల కందరికి కృషితో నాస్తి దుర్భిక్షం. ఒక్క రైతుకు మాత్రం కృషితో జాస్తి దుర్భిక్షం. ఎందుకంటావా? వాడు ఎంత జాస్తిగా పండిస్తే అన్ని తిప్పలు పడాల్సిందే. గ్రీన్ రెవిల్యూషన్ అంటే ఏందో తెల్సునా? పచ్చంగా ఉండే వాడు యింకా పచ్చంగా బతికేదిరా.''

అట్ట చూస్తే ముత్తా రెడ్డన్న!

''అన్నా! ముత్తారెడ్డన్న గదా నువ్వు. లెస్స పలికితివన్నా. నా ఆయుస్సు కూడా పోసుకోని నూరేండ్లు బతుకన్నా.'' అని అంటా వెంకటరెడ్డి రొండు చేతులెత్తి దణ్ణం పెడ్తా ఉండాడు.

సంచిలో సగం పుచ్చి సచ్చిన వంకాయిల కత యింక నన్నేమని చెప్పమంటారు? ●